క్లుప్తంగా

శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు,అధికారులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు



ప్రిన్సిపాల్, పీడీలతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. నంద్యాలలో ఇటీవల నిర్వహించిన సబ్‌జూనియర్ విభాగం రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పూజ, వైష్ణవి, సానియా, సబియా, చరణ్, రాజు ప్రతిభ చాటి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన పీడీ సాయికృష్ణను ప్రిన్సిపాల్ నాగ రవీంద్ర తదితరులు అభినందించారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: ప్రజలు పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో వివిధశాఖల మండల స్థాయి అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా భూమి ఆన్‌లైన్ కోసం ఒకరు, భూముల సర్వే కోసం నలుగురు రైతులు, బర్త్ సర్టిఫికెట్ కోసం ఒకరు వినతులు అందజేశారన్నారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.

9న మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: ఈనెల 9వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అబ్దుల్ అల్లాం బాషా సోమవారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల అధ్యక్షురాలు కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు. ఎవ్వరు హాజరు కాకపోయిన వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు.

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: సప్తనది సంగమేశ్వరంలో ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. శ్రావణమాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు శివలింగానికి, లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణాజలాలతో శివలింగానికి అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన నిర్వహించారు.

ఏపీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఏపీఓ జయంతి

పాములపాడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా జయంతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంజామల మండలం నుంచి పాములపాడు మండలానికి బదిలీపై వచ్చానన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అలివేలి మంగమ్మ నందికొట్కూరుకు బదిలీపై వెళ్లినట్లు చెప్పారు.

నేడు నంద్యాల డయాసిస్ బిషప్ పట్టాభిషేకం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ బిషప్‌గా కె.సంతోష్ ప్రసన్నరావు మంగళవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని సోమవారం నంద్యాల డయాసిస్ సెక్రటరీ స్టాండ్లీ విలియం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాలలోని హోలీక్రాస్ కెథడ్రల్ ఆలయ ఆవరణలో ప్రమాణస్వీకారం కార్యక్రమం జరుగుతుందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

కూటమి నేత గుప్పిట్లో పాల కేంద్రం

- కబ్జా చేసి కొనుగోలు చేసినట్లు నమ్మించే యత్నం
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన నెహ్రూనగర్ వాసులు





తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నెహ్రూనగర్ గ్రామస్తులు , కబ్జాకు గురైన పాల సేకరణ కేంద్ర భవనం

పగిడ్యాల: కూటమి నేత కబ్జా చేసిన పాల కేంద్ర భవనాన్ని స్వాధీనం చేసుకుని పొదుపు మహిళల కార్యకలాపాలకు అప్పగించాలని నెహ్రూనగర్ ఎస్సీ కాలనీవాసులు తహసీల్దార్ శివరాముడును కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నెహ్రూనగర్ వాసులు సుందరరాజు, రామాంజనేయులు, నాగేశ్వరరావు, తిరుపాలు పాల కేంద్రం ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నీటి ముంపు పునరావాస పథకం కింద దాదాపు 1991–92లో ప్రపంచ బ్యాంక్ నిధులతో కమ్యూనిటీ భవనం, పాల సేకరణ కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, సెరికల్చర్ భవనం తదితర భవనాలను నీటి ముంపు పునరావాస గ్రామాల్లో నిర్మించారని వివరించారు. అయతే పాల సేకరణ కేంద్రం భవన సముదాయాన్ని గ్రామానికి చెందిన వార్డుమెంబర్ శివ తమ్ముడు శెట్టి రవి అక్రమించుకున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కబ్జారాయుళ్లు ప్రజాహితం కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జా చేయడమే కాకుండా కొనుగోలు చేసినట్లు దొంగ డాక్యుమెంట్లు సృష్టించాడని కబ్జాకు గురైన పాల సేకరణ కేంద్ర భవనంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే ఆ భవనం గ్రామ కంఠం కింద ఉందని దానిని ఎవ్వరూ కొనుగోలు చేయలేదని లిఖితపూర్వకంగా ఇచ్చినట్లు తహసీల్దార్‌కు వివరించారు. తక్షణమే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

బోర్డుల తొలగింపుపై వాగ్వాదం



బోర్డులు తొలగించాలని ఆదేశిస్తున్న అధికారులు

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలో టెండరుదారులు నిర్వహించుకుంటున్న దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలని అధికారులు ఆదేశించడంపై సోమవారం వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానిక టీటీడీ కల్యాణమండపం వద్ద నెలకు షాపుకు రూ. 24 వేలు ప్రకారం మహానందికి చెందిన మనోహర్ రెడ్డి దక్కించుకున్నాడు. టీ, కాఫీ, సమోసా అంటూ భక్తులకు కనపడేలా బోర్డు ఏర్పాటు చేసుకున్నాడు. అయితే కొందరు అధికారపార్టీకి చెందిన వ్యాపారులు దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి బోర్డులు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈఓ ఆదేశాల మేరకు సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, సిబ్బంది నాగభూషణం, తదితరులు మనోహర్ షాపు వద్దకు వెళ్లి బోర్డులు తొలగించాలని ఆదేశించారు. అయితే తాము అద్దెలు కడుతున్నామని, షాపులో ఉన్న వస్తువుల వివరాలు మాత్రమే బోర్డులో పొందుపరచామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పెట్టుకోలేదని వాదించారు. చివరికి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. ఇదిలా ఉండగా ఆలయ పరిధిలో అధికారపార్టీ నేతలు, వ్యాపారులకు ఒక న్యాయం, మిగిలిన వారికి మరో న్యాయం అనేలా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

రెండు నెలల వేతనాలు చెల్లించాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న దృశ్యం

మహానంది: పదోన్నతులు పొందిన, బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు లేని కారణంగా రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదని, సత్వరమే జీతాలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామఫక్కిరెడ్డి డిమాండ్ చేశారు. మహానంది మండలంలో సోమవారం ఉపాధ్యాయుల చేత సభ్యత్వ నమోదు చేయించారు. 2008 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు దస్తగిరి, నర్సయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పంటలకు బీమా గడువు పెంపు

పగిడ్యాల: 2025–26 వార్షిక సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ చేయించడానికి గడువు పెంచినట్లు వ్యవసాయ అధికారి మురళీధర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్నకు ఈనెల 31వ తేదీ ఉన్న గడువును ఈనెల 14వ తేదీ వరకు, వరికి ఈనెల 15వ తేదీ వరకు ఉన్న గడువును ఈనెల 31వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. మండలంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, బీరవోలు, లక్ష్మాపురం, ఆంజనేయనగర్, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎస్. ఘణపురం, పాలమర్రి తదితర గ్రామాల్లోని రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. మొక్కొజొన్న పంట సాగు చేసిన రైతులు ఎకరానికి రూ. 660లు, వరికి ఎకరానికి రూ. 800లు ప్రీమియం చెల్లించాలన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

ఆత్మకూరు: నులిపురుగుల నివారణతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా అన్నారు. సోమవారం ఆత్మకూరులో ఆమె నులిపురుగుల నివారణ ద్వారా కలిగే ప్రయోజనాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అపరిశుభ్రమైన ఆహారం, కలుషితమైన నీరు తీసుకోవడం వల్ల కడుపులో నులి పురుగులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈనెల 12వ తేదీన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేపట్టి మింగించాలన్నారు. ఆరోజు తీసుకోలేని వారు ఈనెల 20వ తేదీన కార్యక్రమం చేపట్టి మాత్రలను అందజేస్తామన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, మండలస్థాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినతులు ఇచ్చేందుకు ఇక్కట్లు



ఆర్డీఓ కార్యాలయంలో అర్జీదారులు గుమికూడిన దృశ్యం

ఆత్మకూరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతులు ఇచ్చేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చేందుకు తరలివచ్చారు. ఉదయం 11.35 గంటలకు జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి రావడంతో అర్జీదారులు తమ వినతి పత్రాలను ఒకరికంటే ఒకరు ముందుగానే ఇచ్చుకోవాలన్న ఉద్దేశ్యంతో తోపులాట జరిగింది. దాదాపు 165 దరఖాస్తులు జిల్లా కలెక్టర్ స్వీకరించినట్లు ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జగదీష్ తెలిపారు.

29న జాతీయ క్రీడా దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ క్రీడాంశాల్లో జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈనెల 5 నుంచి, జోనల్‌స్థాయి పోటీలు 11 నుంచి, రాష్ట్రస్థాయి పోటీలు 16 నుంచి జరుగుతాయన్నారు. వివరాలకు 87126 22576ను సంప్రదించాలన్నారు.

పంచమఠాలలో విశేష పూజలు



రుద్రాక్ష మఠం వద్ద పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోక కల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకర మఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈవో హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఘంటామఠంలో దేవతా మొక్కలైన బిల్వం మొక్కను దేవస్థాన ఈఓ నాటారు.

దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం



డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు శ్రీరామటాకీస్ యజమాని రామిరెడ్డి, శ్రీధర్ సోమవారం కళాశాలలో పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం తోడ్పాటు ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సునీత, అధ్యాపకులు అన్వర్ హుసేన్, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు వేణు, భూపాల్, ఖాజాబాషా, ఆర్ట్ శ్రీను, రంగస్వామి, జార్జ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్టడీ హాల్ ఏర్పాటు



స్టడీ హాల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పట్టణంలోని స్టడీ హాల్ ఏర్పాటు చేశామని జెడ్పీ హైస్కూల్ (కోట) పీడీ, నంద్యాల జిల్లా ఎస్.జీ.ఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్ అన్నారు. సోమవారం పట్టణంలోని భరత్ కాంప్లెక్స్‌లో దాత వేటూరి రంగస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో స్టడీ హాల్ ఏర్పాటు చేయడాని అమెరికాలో నివాసముంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విశ్రాంత ఉద్యోగి శ్రీకన్నా తోడ్పాటు అందించారన్నారు. రత్నం ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుర్చీలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది భాస్కర్, సీపీఐ నాయకులు రఘురామమూర్తి, శ్రీనివాసులు, రాజన్న, విజయ్, రియాజ్, నవీన్, సాగర్, తేజ, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

శుభాకార్యం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి కుమారుడి వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. శిల్పా వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, నాయకులు సయ్యద్‌మీర్, అంబాల ప్రభాకర్ రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాల మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

షడ్రక్ సేవలు మరువలేనివి



షడ్రక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కామ్రేడ్ స్వర్గీయ షడ్రక్ సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ కొనియాడారు. సోమవారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో కామ్రేడ్ షడ్రక్ 5వ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో భూ సమస్యలపై కామ్రేడ్ షడ్రక్ ప్రజా ఉద్యమాలు చేపట్టారన్నారు. ప్రజల కోసం కేసులను కూడా లెక్కజేయకుండా పోరాడారన్నారు. జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్ర నిర్వహించి దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు డాల్ వెంకటేశ్వర్లు, రామ్‌నాయక్, నాగేశ్వరరావు, వీరన్న, మాబాషా, ఆశీర్వాదం, నూర్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

మన మిత్ర యాప్‌పై అవగాహన

పాములపాడు: గ్రామ పంచాయతీల్లో మంగళవారం నుంచి మన మిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు.

గోరుకల్లులో 8 టీఎంసీల నీరు నిల్వ

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో 8.6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఎస్ఈ సుభకుమార్ తెలిపారు. బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 14 వేలు క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇక్కడి నుంచి గాలేరు నగరి సుజల ప్రవంతికి 16వేలు క్యూసెక్కుల నీరు పంపుతున్నట్లు వెల్లడించారు.

వాసవీమాత ఆలయ పునఃప్రతిష్ట వేడుకలు ప్రారంభం



విగ్రహాలకు పూజలు చేసిన దృశ్యం



వాసవీ మాత ఆలయంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: మండల కేంద్రంలో దాతల సహకారంతో పునఃనిర్మించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ ప్రతిష్ట వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజతో పూజలు ప్రారంభం కాగా, ఆ తరువాత కంకణధారణ, గోపూజతో పాటు పట్టణంలో దేవతామూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో భక్తుల కోలాటం ఆకట్టుకుంది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లాలం సుధాకర్, ప్రధాన కార్యదర్శి లాలం రామకృష్ణ, ఉపాధ్యక్షుడు లాలం జనార్దన, కోశాధికారి మాలపాటి శ్రీనివాసులు, జాయింట్ కోశాధికారి సీవీ లక్ష్మీనారాయణ, సలహాదారులు జూటూరు నాగపుల్లయ్య, బీవీ బాలయ్య, మాల పాటి రమణయ్య, చిత్రాల రమణయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి..

శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దీవెనలతో శ్రీశైలం నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి అని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయ పాల్, ఇలియాస్‌ఖాన్ ఉన్నారు.

పని చేయని ఆన్‌లైన్ యాప్‌లతో ఇబ్బందులు



ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: పని చేయని ఆన్‌లైన్ యాప్‌లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మదార్‌బీ, హరిత అన్నారు. యాప్ భారాన్ని తొలగించాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లకు సపోర్టు చేయడం లేదన్నారు. నెట్ వర్క్, సర్వర్లు పనిచేయకపోతే ఆన్‌లైన్ వర్క్ చేయలేమని తేల్చి చెప్పారు. ఫొటో క్యాప్చర్, ఓటీపీ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు పంపిణీ చేయాలని పెట్టిన నిబంధనలు అమలు చేసేందుకు ఇబ్బందులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేవారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాలకృష్ణ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కుర్షిద్ బీ, లక్ష్మి, ప్రసన్న, తులసమ్మ, శ్యామల, లక్ష్మికుమారి, శైలజ, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమండపంలో కొలువు తీర్చి శాస్త్రోక్త పూజలు చేపట్టారు. గోమాతలకు పట్టువస్త్రాలు ధరింపచేసి పల్లకీసేవ ముందు నడిపించగా భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకీసేవ కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను పగలగొడతాం




మాట్లాడుతున్న సీపీఎం నాయకులు ఏసురత్నం

ఆత్మకూరు: ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొడతామని సీపీఎం, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, రణధీర్, సుధాకర్, మాబాషా, వీరన్న హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం, ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చారని, ఇప్పుడు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను పెట్టడం వల్ల ప్రజలపై కరెంట్ చార్జీల భారం పెరుగుతుందన్నారు. మొబైల్‌కు రీచార్జ్ చేసుకున్నట్లుగా రీచార్జ్ చేయించాల్సి ఉంటుందన్నారు. డబ్బులు ఉంటేనే కరెంట్ వస్తుందని, డబ్బులు అయిపోతే కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. ఉదయానికి ఒకరేటు, మధ్యాహ్నానికి మరో రేటుగా కరెంట్ చార్జీలు మీటర్లలో రికార్డు అవుతున్నాయన్నారు. మీటర్‌కు అయ్యే రూ.17 వేలు కూడా ప్రజలే నెలనెలా కరెంట్ చార్జీల రూపంలో చెల్లించాలని చెప్పారు. ప్రజలపై భారం వేసి ప్రజల డబ్బును అదానీకి దోచి పెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు, పాలశివుడు, క్రిష్ణమోహన్, రాముడు, ఆశీర్వాదం, శ్రీనివాసులు, పుల్లయ్య, సుబ్బయ్య, గోపాల్, నూర్‌హుసేన్, శివన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికి సిద్ధం కావాలి

నందికొట్కూరు: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం కావాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వినోద్ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలలో, వాణిజ్య సంస్థల్లో ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించారని, ఇప్పుడేమో గృహాలకు బిగించేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేయడం సిగ్గుచేటన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించి సామాన్య, పేద, మధ్య తరగతి కుటుంబాలపై మోయలేని భారం కూటమి ప్రభుత్వం వేయడం దారుణమన్నారు. సమావేశంలో ఆ పార్టీ తాలూకా నాయకులు షేక్షావలి, రామకృష్ణ, మండల నాయకులు సోమన్న, సుధాకర్, శ్రీనివాసులు, ఏసన్న, మహమ్మద్ రఫీ, లక్ష్మీదేవి, బీబీ, ముర్తుజాబి, తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోవద్దు



ఈశ్వర్‌నగర్ కాలనీలో రాత్రి పర్యటిస్తున్న సీఐ, ఎస్ఐలు

మహానంది: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, గొడవలు సృష్టించడం లాంటివి చేస్తే తీవ్రమైన చర్యలు తప్పవని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డితో కలిసి మహానందిలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో సోమవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువకులు క్షణికావేశాలకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఒకసారి నేరప్రవృత్తి ముద్ర పడితే జీవితాంతం నలిగిపోవాల్సి ఉంటుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.